## నర్సాపూర్‌లో ఫుట్‌పాత్‌లపై దుకాణాల తొలగింపు

**నర్సాపూర్, డిసెంబరు 2, ప్రభాతవార్త :**
నర్సాపూర్ పట్టణంలో ఫుట్‌పాత్‌లపైన వెలిసిన దుకాణాలను మున్సిపల్ అధికారులు సోమవారం తొలగించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నర్సాపూర్ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి ప్రభాకర్, ప్రజారోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో నర్సాపూర్ పట్టణంలోని ప్రధాన రహదారిలో అక్రమంగా వెలసిన దుకాణాలను తొలగించారు. నర్సాపూర్ పట్టణంలోని ప్రధాన రోడ్డుపైన చిన్న చిన్న దుకాణాలు వెలియడంతో పాదాచారులకు, వాహనదారులకు ఎన్నో ఇబ్బందులు కలుగుతున్నాయి. ఈ మేరకు ప్రజలు పలువురు అధికారులకు ఫిర్యాదు చేయగా స్పందించిన ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసి అక్రమంగా వెలిసిన దుకాణాల తొలగింపుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు టౌన్ ప్లానింగ్ అధికారుల ఆధ్వర్యంలో నర్సాపూర్ రోడ్డులోని ఫుట్‌పాత్‌ల పైన అక్రమంగా ఏర్పాటు చేసుకున్న దుకాణాలను పూర్తిగా తొలగించి వేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి ప్రభాకర్ తో పాటు సానిటరీ ఇన్స్పెక్టర్ సల్ల మురళి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## విద్యార్థులను ఉపాధ్యాయులను వేధిస్తున్న టీచర్‌పై చర్యలు తీసుకోవాలి

**కొల్చారం, డిసెంబరు 2 ప్రభాతవార్త:** విద్యార్థులపై చేయి చేసుకుంటూ తోటి ఉపాధ్యాయుల పట్ల ఇష్టారీతిగా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లి దండ్రులు ఆందోళనకు దిగిన సంఘటన కొల్చారంలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం జరిగింది. పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సంపత్ కొంతకాలంగా సైకోగామారి విద్యార్థులు, ఉపాధ్యాయులను వేధిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. తాజాగా సోమవారం మేదరి నర్సింలు కుమారుడు అక్షిత్ కుమార్‌ను రెండు చెవులు పట్టి పైకి లేపి కిందపడవేయడంతో తరగతి గదిలోనే మూత్రం చేసుకోవడమే కాకుండా స్పృహ తప్పిపడిపోయాడు. ఈ విషయమై తోటి ఉపాధ్యాయులు వారిస్తే వారినీ అసభ్యంగా తిట్టినట్లు అక్కడి వారు తెలిపారు. విషయం తెలుసుకున్న అక్షిత్ తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకొని ఆందోళనకు దిగారు. వీరికి ఉపాధ్యాయులు మద్దతు తెలిపారు. దీంతో ఉపాధ్యాయుడు సంపత్ పాఠశాల నుండి వెళ్లిపోయాడు. విషయం తెలుసుకున్న మండల విద్యాధికారి సత్యనారాయణరావు పాఠశాలకు చేరుకొని ఆందోళనకు దిగిన విద్యార్థి తల్లిదండ్రులకు నచ్చజెప్పి సదరు ఉపాధ్యాయుడిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పూలబొకే అందజేసి స్వాగతం పలుకుతున్న మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ తదితరులు

## సిఎం రేవంత్‌రెడ్డికి ఘన స్వాగతం

**సంగారెడ్డి బ్యూరో, డిసెంబరు 2 ప్రభాతవార్త:** మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామం హెలీప్యాడ్ వద్ద ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని పూలబొకేతో స్వాగతం పలికిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి, ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్, అదనపు కలెక్టర్ నగేష్, సిద్దిపేట సీపీ అనురాధ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎలక్షన్‌రెడ్డి, నర్సారెడ్డి, మెదక్ గ్రంథాలయ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల ప్రజా ప్రతినిధులు.

## ఘనంగా ఆరోగ్య ఉత్సవాలు




పారా మెడికల్, నర్సింగ్ స్కూల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న కలెక్టర్

**సంగారెడ్డి బ్యూరో, డిసెంబరు 2 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం పూర్తికానున్న నేపథ్యంలో ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల సందర్భంగా సోమవారం మెదక్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆరోగ్య ఉత్సవాల కార్యక్రమం నిర్వహించారు. మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ రవీందర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. వర్చువల్ పద్ధతిలో పారా మెడికల్, నర్సింగ్ స్కూల్, ట్రాన్స్ జెండర్ క్లినిక్, ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను మంత్రులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించగా, స్థానికంగా జ్యోతి ప్రజ్వలనచేసి కలెక్టర్ రాహుల్‌రాజ్ ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభోత్సవం చేశారు. మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో ట్రాన్స్ జెండర్ క్లినిక్‌ను సూపరింటెం డెంట్ శివదయాల్ ప్రారంభించారు. కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ కమలాదేవి, డీసీహెచ్‌ఎస్ సూపరింటెండెంట్ శివదయాల్, ప్రొఫెసర్ శాంత కుమారి, గైనకాలజిస్ట్ హెచ్‌వోడీ శాంతకుమారి, వైస్ ప్రిన్సిపల్ వాణిపద్మజ, వైద్యారోగ్య శాఖ అధికారులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

### ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

**డిఆర్‌వో భుజంగరావు**



ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరిస్తున్న డీఆర్‌వో భుజంగరావు

**సంగారెడ్డి బ్యూరో, డిసెంబరు 2 ప్రభాతవార్త:** ప్రజావాణిలో ప్రజలు అందించిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని డీఆర్‌వో భుజంగరావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి పలు సమస్యలపై వచ్చిన ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. జడ్పీ సీఈవో ఎల్లయ్యతో కలిసి ప్రజల నుండి పింఛన్-04, ధరణి-37, ఇందిరమ్మ ఇళ్లు-02, ఇతర సమస్యలు-29 మొత్తం 72 దరఖాస్తులు తీసుకున్నారు. ఈ సందర్భంగా డీఆర్‌వో భుజరంగరావు మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందించిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కార దిశగా కృషి చేయాలని, పరిష్కారం కాని అంశాలను క్షుణ్ణంగా వివరించి ప్రజావాణిపై ప్రజలకు నమ్మకం ఏర్పడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేందుకు కృషి చేయాలని చెప్పారు. ప్రజల వద్ద నుంచి వచ్చిన దరఖాస్తులను సత్వర పరిష్కారానికి సంబంధిత జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇతర జిల్లా అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శుచి, శుభ్రతతో వంటలు చేయాలి : డిఇవో

**కొండపాక, డిసెంబరు 2, ప్రభాతవార్త :** భోజనం వండే ముందు ప్రతిరోజు కిచెన్ షెడ్, పరిసరాల శుభ్రం చేయాలని డిఈఓ ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి ప్రధానోపాధ్యాయులకు, మధ్యాహ్న భోజన కార్మికులకు నిర్వహించిన సమావేశంలో సూచించారు. సోమవారం మండల కేంద్రంలో ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి అధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో అయన పాల్గొని మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులు శుచి, శుభ్రత పాటిస్తూ ప్రభుత్వం సూచించిన వంటల మెనును పాటించాలన్నారు. ప్రతిరోజు భోజనం వండే ముందు కిచెన్ షెడ్, పరిసరాలను శుభ్రం చేయాలని, వంట పాత్రాలను వేడి నీటితో ప్రతిరోజు కడగాలని సూచించారు. కడిగేముందు పురుగులు, నాణ్యతలేని బియ్యం వాడకూడదని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి పాఠశాలకు కొత్త పాత్రాలను సరఫరా చేస్తుందని, బిల్లులను ఇప్పటికే చెల్లించడం జరిగిదని వివరించారు. ప్రతి పాఠశాలలో మధ్యాహ్న భోజన కమిటీని వేయాలని, మండలంలో టాస్క్‌పోర్స్ కమిటీనివేయడం జరుగుతుందని అ కమిటీలో తహసీల్దార్, ఎంపిడిఓ, ఎంఈఓ, స్థానిక డాక్టర్ సభ్యులుగా ఉంటారన్నారు.



మాట్లాడుతున్న డిఇఓ శ్రీనివాస్‌రెడ్డి

# సిద్దిపేట జిల్లాను అభివృద్ధి చేయాలి

### సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య

**గజ్వేల్, డిసెంబరు 2 (ప్రభాతవార్త):**
సిద్దిపేట జిల్లాను సమగ్రంగా అభివృద్ధి చేయాలని, భూ నిర్వాసితులు అందరికీ ప్యాకేజీలు వెంటనే ఇవ్వాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. గజ్వేల్ పట్టణంలో నిర్వహిస్తున్న జిల్లా సిపిఎం మహాసభల్లో మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలోని సిద్దిపేట, దుబ్బాక, చేర్యాల ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ప్రాజెక్టులు, పరిశ్రమల పేరుతో వేలాది ఎకరాల భూమిని సేకరించడం జరిగిందని, కానీ భూ నిర్వాసితులకు పూర్తిస్థాయి ప్యాకేజీలు ఇవ్వలేదని, మూడు నాలుగు సంవత్సరాలు గడిచినా ప్రజలందరూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. కనీసం ఈ ప్రభుత్వమైనా సమస్యల పరిష్కారం చేయాలన్నారు. పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలుకు నోచుకోవడం లేదని, ఉద్యోగ భద్రతలేదని, వేలాది మంది కార్మికులు ఉన్నా ఈఎస్ఐ డిస్పెన్సరీ హాస్పిటల్ లేవని అన్నారు. బిడి, హమాలీ, భవన నిర్మాణ, ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు భద్రత లేదని, సమగ్ర భీమా చట్టం చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ, మున్సిపల, అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, విద్యుత్ రంగాల సమస్యలు పరిష్కరించాలని, కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని అన్నారు. కార్మికులు, రైతాంగం, ఉపాధి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో ఉద్యమాలు తీవ్రతరం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్ర మహాసభలు సంగారెడ్డి పట్టణంలో జరుగుతున్నాయని జయప్రదం చేయాలని జిల్లా నుండి భారీ సమీకరణ చేసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్కా రాములు, జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, శశిధర్, గోపాలస్వామి, ఎల్లయ్య, భాస్కర్, సత్తిరెడ్డి, బండ స్వామి, రంగారెడ్డి పాల్గొన్నారు.




మాట్లాడుతున్న నాగయ్య



రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తిని పరిశీలిస్తున్న మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తదితరులు

## మానవత్వం చాటిన కలెక్టర్, ఎస్పీ

### రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలింపు

**చిన్నశంకరంపేట, డిసెంబరు 2,ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో గాయపడి నిస్సహాయస్థితిలో పడిఉన్న వ్యక్తిని అదేమార్గంలో ప్రయాణిస్తున్న జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి గమనించి తమ వాహనంలో ఆసుపత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. ఈఘటన మండల పరిధిలో కొర్విపల్లి వద్ద సోమవారం చోటు చేసుకుంది. మెదక్ మండలం మక్త భూపతిపూర్ గ్రామానికి చెందిన రాజు చిన్నశంకరంపేటలోని ఓ ప్రైవేటు పరిశ్రమలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. విధులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న క్రమంలో కొర్విపల్లి శివారులోని కొనుగోలు కేంద్రం వద్దకు రాగానే తన ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. అదేసమయంలో మెదక్ వైపు వెళ్తున్న జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డిలు గమనించి క్షతగాత్రుడిని పరిశీలించి అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సమయం ఎక్కువవుతుందని వారు తెలపడంతో ఎస్పీ,కలెక్టర్‌లు స్పందించి తమ వాహనంలో క్షత గాత్రుడిని మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు ఆయన సూచించారు. ప్రమాదం జరిగిన మనకేందుకు లే అని చేతులు దులుపుకొని వెళ్లే ఈ రోజుల్లో గాయపడిని వ్యక్తిని ఆసుపత్రికి తరలించిన ఎస్పీ,కలెక్టర్లను పలువురు అభినందించారు. ఈ సంఘటనతో అందరికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు.

### నేడు ఆయిల్‌ఫామ్ చెట్లపై అవగాహన సదస్సు

**చిన్నశంకరంపేట, డిసెంబరు 2,ప్రభాతవార్త:** పట్టణంలో మంగళవారం రైతు వేదిక భవనంలో ఉదయం 10 గంటలకు నిర్వహించే అయిల్ ఫామ్ చెట్ల పెంపకంపై మండల రైతులకు అవగాహన సదస్సును నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి లక్ష్మీప్రవీణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సదస్సుకు డిహెచ్ ఎస్‌వో ప్రతాప్‌సింగ్, అయిల్ ఫాం పరిశ్రమ సలహదారు డా. రంగ నాయకులు, ప్రాజెక్టు మేనేజర్ డా,కృష్ణలు పాల్గొంటారని ఆయన వెల్లడించారు. పంటలను ఎలా వేయాలి, దిగుబడి రాయితీపై వచ్చే మొక్కలు,డ్రిప్ పద్ధతి వంటి అంశాలపై అవగాహన కల్పిస్తారని, మండల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.



గురుకుల పాఠశాలలో భోజనాలను పరిశీలిస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

## గురుకుల పాఠశాలలు నిర్వీర్యం

### అధ్వానంగా తయారైన గురుకుల హాస్టళ్లు

### -బిఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

**గజ్వేల్, డిసెంబరు 2 (ప్రభాతవార్త):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి సంవత్సర కాలం అవుతున్న విద్యా వ్యవస్థను గాలికి వదిలేయడం సరైన పద్దతి కాదని బిఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. బిఆర్‌ఎస్‌వి గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా సోమవారం గజ్వేల్ నియోజకవర్గంలోని పలు హాస్టళ్ళను రాష్ట్ర బిఆర్‌ఎస్‌వి నాయకులు, స్థానిక నాయకులతో కలిసి సందర్శించి హాస్టళ్ళలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్బంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ హాస్టళ్ళలో విద్యార్థులకు సరైన భోజనాన్ని అందించడంలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని, చలికాలం వచ్చినా ఇప్పటి వరకు విద్యార్థులకు బెడ్‌షీట్లు ఇవ్వలేదని అన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటి నుండి యూనిఫామ్స్, షూస్ ఇవ్వకుండా కనీసం కాస్మోటిక్ చార్జీలను అందించక నిర్లక్ష్యానికి గురిచేస్తున్నారని, పేద విద్యార్థుల సంక్షేమాన్ని విస్మరించి, నాణ్యతలేని ఆహారాన్ని అందిస్తూ విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో ఆసుపత్రి పాలు అయ్యేలా చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక వెయ్యికి పైగా విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో ఆసుపత్రుల్లో చేరారని, 45 మంది మరణించడం బాధాకరమన్నారు. కెసిఆర్ గురుకులాలను అభివృద్ధి చేసి సకల సదుపాయాలను కల్పించి విద్యార్థులను గొప్పగా తీర్చిదిద్దారని, రేవంత్‌రెడ్డి సర్కార్‌లో గురుకులాలు అధ్వాన్నంగా తయారయ్యాయని అన్నారు. ప్రభుత్వం ప్రతి విద్యార్థిపై పెట్టే పెట్టుబడి రాష్ట్ర భవిష్యత్తుపై పెట్టే పెట్టుబడిగా భావించాలని, గురుకులాలను నడపడం గురుతర బాధ్యతగా భావించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసి చైర్మన్ మాదాసు శ్రీనివాస్, బిఆర్‌ఎస్‌వి జిల్లా అధ్యక్షుడు రెడ్డి యాదగిరి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరంపల్లి పరశురాములు, జింకాల పర్వతాలు, జంగిడి కమలాకర్, నాయకులు నూనె కుమార్‌యాదవ్, నవాజ్‌మీరా, రమేష్‌గౌడ్, బండి శ్రీకాంత్, ప్రవీణ్, నవాజ్, పంగా మోహన్‌బాబు, ఆకుల సతీష్, నిజామొద్దీన్, మిట్టు, రాము, సాయితేజ, బీరప్ప, రాజు, షాదుల్, సాయి మహేష్, భాస్కర్, కనకరాజు, భాను తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సు ఢీకొని విద్యార్థినులకు తీవ్ర గాయాలు

### మెదక్ బొడ్మట్పల్లి రోడ్డుపై వర్షంలో విద్యార్థుల ఆందోళన...ఆర్టీసి డిఎంపై విద్యార్థుల ఆగ్రహం..గంటపాటు స్థంభించిన వాహనాలు

**పాపన్నపేట, డిసెంబరు 2, ప్రభాతవార్త:**
ఆర్టీసి బస్సు ఢీకొని ఇద్దరు కాలేజీ విద్యార్థినులకు తీవ్ర గాయాలైన సంఘటన పాపన్నపేట మండలం నార్సింగి వద్ద సోమవారం జరిగింది. దీంతో ఆర్టీసి డీఎం తీరును నిరసిస్తు పాపన్నపేట వద్ద కాలేజీ విద్యార్థులు మెదక్‌బొడ్మట్పల్లి రోడ్డుపై రాస్తారోకోకు దిగారు. వర్షంలోనూ కదలకుండా గంటపాటు ఆందోళన కొనసాగించారు. దీంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. పాపన్నపేట పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం...నార్సింగి గ్రామానికి చెందిన ఆఖిల, విజయ పాపన్నపేట జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. కాలేజీకి వచ్చేందుకు నార్సింగి బస్‌స్టాప్ వద్ద తోటి విద్యార్థులతో కలిసి నిల్చున్నారు. ఆదే సమయంలో బొడ్మట్పల్లి నుండి మెదక్ వెళుతున్న మెదక్ డిపో బస్సు వీరిని ఢీకొట్టింది. అఖిల కాలుపై నుండి టైరు వెళ్లడంతో కాలు నుజ్జు నుజ్జయింది. విజయకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108కు ఫోన్‌చేసి, మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ప్రిన్సిపల్ నర్సింలు, లెక్చరర్లు శ్రీనివాస్, ప్రవీణ్, ఇంటర్ డిఐఓ మాధవి హస్పిటల్‌కు వెళ్లారు. ఆఖిల పరిస్థితి సీరియస్‌గా ఉండటంతో జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ దృష్టికి విషయం తీసుకెళ్లారు. వారు వెంటనే ఆమెను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పాపన్నపేట ఏఎస్ఐ నంగన్న కేసు



మెదక్ బొడ్మట్ పల్లి రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

**డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలి...**
ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై చర్య తీసుకోవాలని, కాలేజీ, పాఠశాల సమయంలో బస్సుల సంఖ్య పెంచాలని, తీసుకొవాలని, కాలేజి, పాఠశాల సమయంలో బస్సుల సంఖ్య పెంచాలని కోరేందుకు పాపన్నపేట, టేక్మాల్ మండల ఏబివిపి కన్వీనర్లు ప్రవీణ్, మురళి, రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఉదయ్, నగరకార్యదర్శి అనీల్ తదితరులు మెదక్ ఆర్టీసి డిపో మేనేజర్ సురేఖ వద్దకు వెళ్లగా కనీసం అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని ఆరోపించారు. ఫోన్ చేసినా స్పందించకపోవడంతో వారంతా పాపన్నపేటకు వచ్చి, కాలేజి విద్యార్థులతో కలసి,రోడ్డుపై ఆందోళనకు దిగారు. వర్షంలోనూ తడుస్తు, గంటసేపు ఆందోళన కొనసాగించారు. మెదక్ డీఎం, జిల్లా అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పాపన్నపేట పోలీసులు సముదాయించినా వినలేదు. దీంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. బస్సుల సంఖ్య పెంచాలని, బాధ్యులైన డ్రైవర్‌పై తగిన చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. చివరకు ప్రిన్సివల్ నర్సింలు వచ్చి విద్యార్థులను నముదాయించి, జిల్లా అధికారులతో మాట్లాడి బాధిత కుటుంబాలకు న్యాయం చేయిస్తామని, హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

## ప్రజావాణిపై ప్రజలకు పెరుగుతున్న విశ్వాసం

### సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**
ప్రజావాణి కార్యక్రమంపై రోజు రోజుకూ ప్రజలకు మరింత విశ్వాసం పెరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణిలో ప్రజల నుంచి ఆయన దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. ప్రజావాణిలో సమస్యలు పరిష్కారం అవుతాయని ఎంతో నమ్మకంతో జిల్లాలోని ఆయా ప్రాంతాల నుంచి సమస్యలను విన్నవించుకోవడానికి వస్తారని తెలిపారు. ప్రజలు ఎంత నమ్మకంతో ప్రజావాణికి వస్తారో అంతే నమ్మకంతో దరఖాస్తు దారుల సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేయొద్దన్నారు. కార్యక్రమంలో డిఆర్వో నాగరాజమ్మ, వివిధశాఖల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పశువుల అక్రమ తరలింపుపై చర్యలు తీసుకోవాలి

### సిద్దిపేట జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బిఎస్‌పి నాయకులు




కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

**హుస్నాబాద్ టౌన్, డిసెంబరు 2, ప్రభాతవార్త :** హుస్నాబాద్‌లో ప్రతీ శుక్రవారం జరిగే వారసంత నుండి వెటర్నరీ డాక్టర్ అనుమతులు లేకుండానే వ్యాపారస్తులు మూగ జీవాలైన పశువులను గోవధశాలలకు తరలిస్తున్నారని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ బిఎస్పి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధనల ప్రకారం పశువుల సంత నుండి పశువులను గోవధ శాలకు తరలించేందుకు ముందు వెటర్నరీ డాక్టర్ వాటిని పరిక్షించాలని.. అయితే గతంలో ఇక్కడ డాక్టర్ లేకపోవడంతో పార్టీ నాయకులతో కలసి మున్సిపల్ కమిషనర్‌కు విన్నవించి డాక్టర్‌ను ఏర్పాటు చేయించగలిగామన్నారు. డాక్టర్ ఒక్కరే ఉండడంతో పశువుల విక్రయదారులు, గోవధశాలల నిర్వాహకులు వారిని ఒదిలి పెట్టాలని స్థానిక నాయకులతో ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. శుక్రవారం అంగట్లో వెటర్నరీ డాక్టర్‌తోపాటు తనకు కావాల్సిన సిబ్బందిని నియమించి ఈ అక్రమార్కుల నుండి నోరులేని జీవాలను కాపాడాలన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో కిసాన్ సంఘ్ డివిజన్ అధ్యక్షులు కవ్వ వేణుగోపాల్ రెడ్డి, బిఎస్పి నాయకులు ఎనగందుల శంకర్, అధ్యక్షులు వేల్పుల రాజు, సుధాకర్ ఉన్నారు.

### నేడు మున్సిపల్‌లో ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమాలు

గజ్వేల్, డిసెంబరు 2 (ప్రభాతవార్త): ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా ఈనెల 3వ తేదీ మంగళవారం వివిధ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య తెలిపారు. ఉదయం 10 గంటలకు మున్సిపల్ కార్యాలయం నుండి ర్యాలీ, 11 గంటలకు పారిశుద్ధ్య కార్మికులకు సన్మాన కార్యక్రమం, 11.30 గంటలకు పారిశుద్ధ్య కార్మికులకు వైద్య ఆరోగ్య శిబిరం, సాయంత్రం 3 గంటలకు మహిళ శక్తి కింద ఎస్‌హెచ్‌జి సభ్యులకు బ్యాంక్ లింకేజ్ చెక్కుల పంపిణీ, 4 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలను మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

## ఆత్మ స్థైర్యం ముందు ఓడిన అంగవైకల్యం

### దివ్యాంగులకు వెంకటయ్య ఆదర్శం

**జహీరాబాద్, డిసెంబరు 2 ప్రభాతవార్త :** ఆత్మస్థైర్యం ముందు ఓడిన అంగవైకల్యం అందరికి ఆదర్శంగా నిలుస్తున్న వెంకటయ్య కోహీర్ మండలం పైడిగుమ్మల్ గ్రామానికి చెందిన పేద కుటుంబంలో ఆపై పుట్టుకతోనే అంగవైకల్యం అయినప్పటికీ చదువుపై ఎంతో ఆసక్తితో ముందుకు సాగిన వెంకటయ్య ఇపుడు అందరికీ స్ఫూర్తిదాయకం అయ్యాడు. జహీరాబాద్ బీసీ హాస్టల్‌లో ఉంటూ పదవతరగతి ఉత్తీర్ణత సాధించి ట్యూషన్లు చెబుతూవచ్చిన ఆదాయంతో ఉన్నత చదువును పూర్తిచేశాడు. ఉన్నత చదువులు చదువుకోవాలని కోరికఉన్నా ఆర్థిక స్థోమత లేకపోవడంతో ట్యూషన్లతో కొంతకాలం గడిపాడు. వెంకటయ్య పరిస్థితి గమనించి స్థానిక శ్రీమాణిక్‌ప్రభు మందిరంలో కొంత భాగం విద్యార్థులకు వసతి కల్పించారు. 1984 సంవత్సరంలో పెద్దల సహకారంతో 16 మంది విద్యార్థులతో ప్రారంభమైన శ్రీమాణిక్ ప్రభు పాఠశాల దినదినాభివృద్ధి చెందుతూ ప్రముఖ పాఠశాలలో ఒకటిగా గుర్తింపు పొందింది. నేడు సుమారుగా 500మంది విద్యార్థులతో పాఠశాల పట్టణంలో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకుంది. తన వద్ద చదువుకున్న విద్యార్థులు నేడు వివిధ రంగాల్లో ఉన్నతమైన హోదలో కొనసాగడం చాలా సంతృప్తిని ఇస్తుందని వెంకటయ్య అన్నాడు. 2024వ సంవత్సరంలో యూనివర్సిటీ అసోసియేషన్ ట్రస్మా ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో ఎడ్యుకేషన్ ఐకాన్ ఆఫ్ ద ఇయర్ చేతులమీదుగా ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. 2024వ సంవత్సరంలో జహీరాబాద్ ట్రస్మా ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర సెట్విన్ ఛైర్మన్ అయినటువంటి గిరిధర్‌రెడ్డి ఎంఇఓ బస్వరాజ్ చేతులు మీదుగా అవార్డును అందుకున్నారు. 2023 సంవత్సరంలో కృషి విజ్ఞాన కేంద్రం జహీరాబాద్ వారిచే ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డు అందుకోవడం జరిగింది. 2011లో జిల్లాస్థాయి అవార్డు, 2004లో జిల్లాస్థాయి అవార్డు,2003లో రాష్ట్రస్థాయి విశిష్ట సేవ అవార్డును అప్పటి మంత్రివర్యులు రోశయ్య చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. మాజీ మంత్రి ఎండి ఫరీదుద్దిన్ చేతుల మీదుగా ప్రశంశ పత్రం అందుకున్నారు.




వెంకటయ్యను సన్మానిస్తున్న యూనివర్సల్ హెడ్ లీడర్ సమితి

# పోరాట యోధుడు కెసిఆర్ : గోవర్ధన్‌రెడ్డి



కెసిఆర్ చిత్రం ఉచిత ప్రదర్శనను ప్రారంభిస్తున్న చిమ్ముల గోవర్ధన్ రెడ్డి

**గుమ్మడిదల, డిసెంబరు 2 ప్రభాతవార్త:** ప్రత్యేక రాష్ట్రం సాధించడమే లక్ష్యంగా ఉద్యమాన్ని నిర్వహించిన పోరాటయోధుడు.. మొదటి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా వరుసగా రెండుసార్లు అధికారంలోకి వచ్చి 10 సంవత్సరాలు ప్రజలకు సంక్షేమ పాలనను అందించిన మహానీయుడు.. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి కొనియాడారు. సోమవారం గుమ్మడిదలలోని శ్రీవెంకటేశ్వర సినిమా థియేటర్‌లో కేసీఆర్ స్ఫూర్తిగా విడుదలైన కేసీఆర్(కేశవ చంద్రరమావత్) చిత్రాన్ని నియోజకవర్గ నాయకులతో కలిసి మూడు రోజుల ఉచిత ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రెండు దశాబ్దాల కాలం ఉద్యమాన్ని సాగించి రాష్ట్ర ప్రజలను ఏకతాటిపై తీసుకువచ్చి చావును సైతం లెక్కచేయకుండా ప్రత్యేక రాష్ట్రం సాధించిన పోరాట యోధుడు కేసీఆర్ అని అన్నారు. రాష్ట్రాన్ని సాధించిన అనంతరం వరుసగా రెండుసార్లు అధికారంలోకి వచ్చి ప్రజలకు సంక్షేమ పాలనను అందించడమే గాక దేశంలోనే నెంబర్ 1 రాష్ట్రంగా తీర్చిదిద్దారని ప్రశంసించారు. రైతుబంధు, రైతుబీమా, కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్, కేసీఆర్ కిట్, వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు భారీస్థాయిలో పెన్షన్, రూ. 5 మధ్యాహ్న భోజనం, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సన్న బియ్యంతో భోజనం, గ్రామ గ్రామాన సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు, క్రీడా ప్రాంగణాలు, ప్రభుత్వ భవనాలు, ప్రకృతి వనాలు, బస్తీ దావఖానలు, పల్లె దావఖానలు.. ఇలా చెప్పుకుంటూపోతే బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు అనేక రకాల అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించారని తెలిపారు. అలాంటి వ్యక్తి స్ఫూర్తిగా విడుదలైన కేసీఆర్ చిత్రాన్ని నియోజకవర్గ, మండల ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆయన అభిమానులు వీక్షించవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి నాయకులు ఆదర్శ్‌రెడ్డి, మెట్టు కుమార్‌యాదవ్, కొలాన్ బాల్‌రెడ్డి, జిన్నారం వెంకటేశంగౌడ్, కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి, కుమార్‌గౌడ్, మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, హనుమంత్ రెడ్డి,నంద్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, మొగులయ్య, దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తుపాకుల రాజు, రుక్మారెడ్డి, శ్రీనివాస్, సత్తయ్య, ఆంజనేయులుయాదవ్, సత్యనారాయణ, మహిపాల్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, వాసు దేవరెడ్డి, భాస్కర్, సూర్యనారాయణ, యాదగిరి, థియేటర్ మేనేజర్ జగ్గారి నరసింహారెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కళా ప్రదర్శనలు నిర్వహిస్తున్న కళాకారులు

## ప్రజా పాలన విజయోత్సవాలపై కళా ప్రదర్శనలు

**మనూరు, డిసెంబరు 2 ప్రభాతవార్త:** ప్రజా పాలన విజయోత్సవాలు 2024 అనే కార్యక్రమంపై కళ ప్రదర్శనలు నిర్వహించారు. సోమవారం మనూరు మండల పరిధిలోని మనూరు, పుల్‌కుర్తి, బెల్లాపూర్, బాదల్ గాడ్, మాయికోడు తదితర గ్రామాల్లో ప్రజా పాలన విజయోత్సవ కళా యాత్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆరు గ్యారెంటీలపైన ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలపై కళాయాత్ర రూపంలో ప్రజలకు కళా ప్రదర్శనాల ద్వారా అవగాహన కల్పించారు. సంగారెడ్డి జిల్లా కలెక్టరు, జిల్లా పౌర సరఫరాల సంబంధాల శాఖ అధికారి డిపిఆర్ఓ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక టీం కళాకరుల ఆధ్వర్యంలో కళాప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొమ్ముల శేఖర్‌గౌడ్, టీం లీడర్, నేనవత్ మదన్ సింగ్, నేనవత్ రవీందర్, దరావత్ రాజు, చామంతి ఆగమయ్య, మామిడి సాయిలు, నల్లవాగులా శశిప్రియా, నరిగే స్వప్న, కళాకారులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎంపిడివో

**చిన్నశంకరంపేట, డిసెంబరు 2,ప్రభాతవార్త:** ప్రభుత్వం తర్వలో నిర్వహించే స్థానిక సంస్థల ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలన పరిశీలిస్తున్నట్లు ఎంపీడీవో దామోదర్ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని చందం పేట,రుద్రారం గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. కేంద్రాల వివరాల నమోదు అనంతరం జిల్లా అధికారులకు నివేదిక పంపనున్నట్లు ఆయన వివరించారు. ఆయన వెంట ఎంపీవో గిరిజారాణి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్‌కు ఎంపికైన విద్యార్థి



విద్యార్థులు మధును. సంతోష్‌లను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

**నర్సాపూర్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** నర్సాపూర్ మండలం కాగజ్ మద్దూర్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి మధు ప్రథమ బహుమతి పొందడంతో పాటు రాష్ట్రస్థాయి పోటీకి అర్హత సాధించి ఇన్‌స్పైర్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. మెదక్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లాస్థాయి ఇన్‌స్పైర్, 52 వ రాష్ట్రీయ బాలల వైజ్ఞానిక ప్రదర్శన 2024లో కాగజ్ మద్దూర్ జడ్‌పిహెచ్ఎస్ ఉన్నత పాఠశాల 9 తరగతి చదువుతున్న మధు అనే విద్యార్థి ప్రథమ బహుమతి పొంది రాష్ట్రస్థాయి పోటీకి అర్హత సాధించాడు. రైతులు పొలాల్లో ఎదుర్కొనే జంతువుల సమస్యకు పరిష్కారం అనే అంశంపై ప్రదర్శన ఇవ్వగా పరిశీలకులు చూసి విద్యార్థి మధుకు అభినందనలు తెలిపారు. ప్రదర్శనలో ఇదే పాఠశాలకు చెందిన 8వ తరగతి చదువుతున్న విద్యార్థి సంతోష్ సైతం ద్వితీయ బహుమతి సాధించాడు. ఈ సందర్భంగా గైడ్ టీచర్ యూసుఫ్ షరీఫ్‌ను పాఠశాల ఉపాధ్యాయ బృందం సోమవారం సత్కరించింది. అంతేగాక బహుమతులు సాధించిన విద్యార్థులు మధు, సంతోష్‌లను ఉపాధ్యాయ బృందం అభినందించింది. విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి చూపాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాజియా తబస్సుమ్ అన్నారు. నిజజీవిత సమస్యలకు సైన్స్ పరిష్కారాలను సూచిస్తుందని సీనియర్ ఉపాధ్యాయులు డా. ఆర్.సూర్యప్రకాశ్‌రావు చెప్పారు. పాఠశాల నుండి ప్రదర్శించిన ఎగ్జిబిషన్లకు చక్కటి స్పందన లభించిందని గైడ్ టీచర్ యూసుఫ్ షరీఫ్ చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేందర్‌రెడ్డి, సత్యనారాయణాచారి, కవిత, వేంకటేశ్వరరావు, అప్పలనాయుడు, సురేష్ కుమార్, సుందరయ్య, బస్వరాజు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## గుడి నిర్మాణానికి విరాళం

**నర్సాపూర్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** ఈ రోజు నర్సాపూర్ మండలం అచ్చంపేట గ్రామంలో అంబేద్కర్ యువసేన ఆధ్వర్యంలో కొత్తగా నిర్మిస్తున్న పోచమ్మ గుడి నిర్మాణానికి బిజెపి రాష్ట్ర నాయకులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ తనవంతు ఆర్థిక సహాయంగా 5 వేల రూపాయిలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర నాయకులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఇలాంటి ఆలయాలు నిర్మిస్తే ఆ గ్రామ ప్రజలకు దైవభక్తి, ఆధ్యాత్మిక చింతన పెరుగుతుందన్నారు. ఈమేరకు ఎక్కడ ఏ గ్రామంలో ఇలాంటి ఆలయాలు నిర్మించినా తన వంతు ఆర్థిక సహాయాన్ని అందిస్తానని ఆయన తెలిపారు. ఈసందర్భంగా అచ్చంపేట గ్రామస్థులు వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆలయంలో శివయ్యకు ప్రత్యేక పూజలు

**శివ్వంపేట, డిసెంబరు 2, ప్రభాతవార్త:** మండలంలోని గూడూరు గ్రామం పురాతన సోమేశ్వర ఆలయంలో మార్గశిర మాసం మొదటి సోమవారం పురస్కరించుకొని ఆలయంలో శాస్త్రుల రాజశేఖర్‌శర్మ ఆధ్వర్యంలో సోమేశ్వరస్వామికి ఆరాధన, అభిషేకం, విష్ణు అష్టోత్రం విష్ణుసహస్ర నామార్చన, హారతి వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు రాజశేఖర్‌శర్మ మాట్లాడుతూ మార్గశిరం మాసం పురస్కరించుకొని సోమేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహించామని ఈ ఆలయం పురాతనమైన శక్తివంత ఆలయం అని స్వామివారిని దర్శించుకున్న వారికి సోమేశ్వరస్వామి అనుగ్రహం కలుగుతుందని ఆయన అన్నారు. ఆలయంలో ప్రతిరోజు పూజలు జరుగుతున్నాయని ఆలయం మరింత అభివృద్ధికి దాతలు ముందుకు వచ్చి సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## వనరుల కేంద్రంలో సిబ్బందిని నియమించాలి

**వెల్దుర్తి, డిసెంబరు 2 ప్రభాతవార్త:** మాసాయిపేట మండల వనరుల కేంద్రానికి ఎంఐఎస్, కంప్యూటర్ ఆపరేటర్, మెసెంజర్‌లను నియమించాలని మండల తపస్ జిల్లా బాధ్యులు రంగారెడ్డి, తపస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భద్రయ్య, ఝాన్సీలు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మండలానికి రెగ్యులర్ ఎంఈవోను నియమించి దాదాపు నెల రోజులు గడుస్తున్నా, సిబ్బంది లేకపోవడంతో ఉపాధ్యాయులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

### అక్రమ అరెస్టులు తగదు

**పూడూరు, డిసెంబరు 2, ప్రభాతవార్త:** అక్రమ అరెస్టులు తగదని బిఆర్ఎస్‌పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి జంగయ్య పేర్కొన్నారు. సోమవారం పూడూరు మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ ఆశ్రమ పాఠశాలను పార్టీ పూడూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు రాంచెంద్రయ్యతో కలిసి సందర్శించి విద్యార్థులకు అందజేసే భోజనవసతిని తెలుసుకునేందుకు వెళుతున్న తమను చెన్‌గోముల్ పోలీసులు అరెస్టుచేయడం ఎంతవరకు సమంజస మని నిలదీశారు. రాష్ట్రంలో విద్యార్థులకు నాణ్యత లోపించిన భోజనాలు అందజేయడంవల్ల ఈ మధ్యకాలంలో పలువురు విద్యార్థులు అస్వస్తతకు గురవుతున్నారని వివరించారు. ఇలాగే కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ అరెస్టులు కొనసాగిస్తే భవిష్యత్తులో తీవ్రపరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

### ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి

**షాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఆరు గ్యారంటీల పేరుతో 420హామీలు ఇచ్చిందని బిజెపి మండల అధ్యక్షులు కిరణ్ అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని అమలు చేయడంలో విఫలమైందన్నారు. రైతు రుణమాఫీ పూర్తిచేశామని చెప్పుకుంటూ రైతులను మోసంచేసిందన్నారు. రాష్ట్రంలో పిఎం నరేంద్రమోడీ సహకారం వల్ల మాత్రమే అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు.

## అన్ని సబ్జెక్టులకంటే గణితం ప్రత్యేకం



విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ఉపాధ్యాయులు

**మర్కుక్, డిసెంబరు 2, (ప్రభాతవార్త):** అన్ని సబ్జెక్టులకంటే గణితం ముఖ్యమైనదని మండల విద్యాధికారి వెంకటరాములు అన్నారు. సోమవారం మండలకేంద్రం మర్కుక్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి గణితం టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ సివి.రామన్ జయంతిని పురస్కరించుకొని విద్యార్థులకు గణితం సబ్జెక్టుపై మండలస్థాయి టెస్టు నిర్వహించామన్నారు. గణితంపై విద్యార్థులు ప్రత్యేక దృష్టిపెట్టాలని, గణితంతో భవిష్యత్తు ముడిపడి ఉంటుందని తెలిపారు. మండలస్థాయి టెస్టులో ఇంగ్లీష్‌మీడియం ప్రథమ స్థానంలో బి.నాగచైతన్యరెడ్డి జెడ్‌పిహెచ్ఎస్ పాములపర్తి, ద్వితీయ బహుమతి ఎం.భవాని జెడ్‌పిహెచ్ఎస్ దామరకుంట, తృతీయ బహుమతి పి.హరీష్ జెడ్‌పిహెచ్ఎస్ మర్కుక్‌లు, తెలుగు మీడియంలో విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మర్కుక్ విద్యార్థులు సాహితి, అజయ్‌కుమార్, నాగప్రకాష్‌లు గెలుచుకున్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలను కార్యక్రమంలో మర్కుక్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశం, పిఆర్‌టియు మండల శాఖాధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరావు, గణిత మండల ఫోరం కన్వీనర్ ఎ.నాగేశ్వర్‌రావు, గణిత ఉపాధ్యాయులు నరహరిప్రసాద్, భూజాత, నరోత్తంరెడ్డి, సైదులు, కేశవరెడ్డి, రమాకాంతరావు, వందన, గణేష్, రమేష్, సిద్ధయ్య, సిఆర్‌పినాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు సాయం చేయడం గొప్ప విషయం

**కొండపాక, డిసెంబరు 2, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులను పోటీ పరీక్షలకు సిద్ధం చేయడానికి లీడ్ లైఫ్ హ్యాపిలి సంస్థ ద్వారా బుక్స్‌ను అందించడం గర్వించదగ్గ విషయమని మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ యజ్ఞశ్రీ అన్నారు. సోమవారం మోడల్ స్కూల్‌లో లీడ్ లైఫ్ హ్యాపిలీ వ్యవస్థాపకుడు కోణం శ్రీకాంత్ మిత్రబృందం చేస్తున్న విద్యాదానం అభినందనీయం అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహిస్తూ విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలను ఉచితంగా అందివ్వడం వారి నిస్వార్థ సేవకు నిదర్శనమన్నారు. దుద్దెడ జాగృతి ఫ్రెండ్స్ మాజీ అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్ట్ వడ్లకొండ శ్రీనివాస్‌తో కలిసి 6,7,8 తరగతుల విద్యార్థులకు పాథ్ ఫైండర్ మెటీరియల్‌ను ఉచితంగా అందించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అ సంస్థ ఆర్గనైజర్ పంజ రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యత ప్రమాణాలు పాటించాలి

**జిల్లెడు చౌదరిగూడ, డిసెంబర్ 02,**(ప్రభాతవార్త): నర్సరీ నిర్వహణలో నాణ్యత ప్రమానాలు పాటించాలని టెక్నికల్ అసిస్టెంట్ వినోద్‌కుమార్ అన్నారు. సోమవారం జిల్లెడుచౌదరిగూడ మండలంలోని ముష్టపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఉపాధిహామీ నర్సరీన్ని ఆయన పరిశీలించారు. నర్సరీలో మొక్కల పెంచేందుకు సేకరించిన ఎర్రమట్టిని ఆయన పరి శీలించారు. ప్రభుత్వ నిబందనల ప్రకారం పనులు చేయాలని ఆయన సూచించారు.ఎర్రమట్టి, ఎరువు,రేగడిమట్టి సేకరించి అన్నింటిని మిశ్రమం చేసి ప్యాకెట్లలో నింపాలని ఆయన తెలిపారు. అప్పుడే మొక్కలు ఏపుగా పెరిగే అవకాశం ఉంటుందని ఆయన పెర్కొన్నారు.

## మధ్యాహ్నభోజనం నాణ్యత పరిశీలన

**బొంరాస్‌పేట్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను కాంగ్రెస్ నాయకులు, గ్రామ ప్రజలు సందర్శించారు. ఈసందర్భంగా వారు బడిపిల్లలతో కలిసి భోజనం చేసి మధ్యాహ్నభోజన నాణ్యతను పరిశీలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మధ్యాహ్నభోజన పథకానికి మెస్‌చార్జీలు పెంచిన కారణంగా పాఠశాలల్లో భోజన నాణ్యత మెరుగుపడిందని అభిప్రాయపడ్డారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్వీపర్లను నియమించడం ద్వారా పాఠశాల పరిసరాలు చాలా పరిశుభ్రంగా మారి నాణ్యమైన ఆహారం తీసుకుంటూ పరిశుభ్రమైన ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థులు చదువుకోగలుగుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ బూత్‌ల ముసాయిదా తయారు చేయాలి



పంచాయతి కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపిడివో

**చేర్యాల,డిసెంబరు 2, ప్రభాతవార్త:** మండలంలోని గ్రామపంచాయతీలలో పోలింగ్ బూతుల ముసాయిదాను తయారు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపిడివో మహబూబ్ అలీ తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఎంపిడివో సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థలు సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో ముసాయిదా జాబితాను తయారు చేయాలని వారికి సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి రచ్చ కిష్టయ్య, ఏపివో మంజుల, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## తాళంవేసి ఉన్న ఇంట్లో చోరీ

**చేర్యాల, డిసెంబరు 2, ప్రభాతవార్త:** తాళం వేసి ఉన్న ఇంట్లో చోరి జరిగిన సంఘటన చేర్యాల పట్టణశివారు సుందరయ్యనగర్‌లో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు చేర్యాల మండలం దొమ్మాట గ్రామానికి చెందిన కొమ్మరాజుల రాజు గతకొన్ని సంవత్సరాలుగా చేర్యాల పట్టణ శివారులోని సుందరయ్యనగర్ కాలనీలో స్వంత ఇల్లు నిర్మించుకుని కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. సోమవారం ఎప్పటిలాగే తన వ్యవసాయ బావి వద్దకు వెళ్ళి తిరిగి సాయంత్రం రాగానే ఇంటి తాళం పగలగొట్టి ఉండటంతో లోపలికి వెళ్ళి చూడగా వస్తువులన్నీ చిందరవందరంగా ఉండటంతో డబ్బులుపెట్టిన చోటును చూసేసరికి ఇంట్లో ఉన్న సుమారు నాలుగుతులాల బంగారం, లక్ష రూపా యల నగదు దొంగిలించబడినట్లు తెలిపారు. వెంటనే చేర్యాల పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారని సమాచారం.

## ముఖ్యమంత్రిని కలిసిన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్

**నర్సాపూర్ డిసెంబరు 2, ప్రభాతవార్త:** మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని కాళ్ళకల్ గ్రామంలో నెలకొల్పిన హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి, నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి, మాజీ జడ్‌పిటిసి శేషశయనారెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వారు శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు ఇచ్చి సన్మానించారు. అంతేగాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఫ్యాక్టరీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

**షాద్‌నగర్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని పలువార్డులకు చెందిన లబ్దిదారులకు సిఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీఖాన్ బాబర్ చేతులమీదుగా ఆరుమందికి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు విశ్వం, పట్టణ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య,అగ్గనూరు బస్వం,కృష్ణారెడ్డి, కౌన్సిలర్ సర్వర్ పాష,రఘు నాయక్,పెంటయ్య,మనీష్,షర్ఫోద్దిన్,ఫయాజ్,మన్నె రవి, నీరటి వాసు, రాజు,గుగ్గిళ్ల రవి,రాజమోనిజగదీష్, అనిల్ పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

### మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

**నారాయణఖేడ్, డిసెంబరు 2 ప్రభాతవార్త:** మండల పరిధిలోని జూకల్ శివారులోగల బీసీ గురుకుల పాఠశాలను సందర్శించడానికి వెళితే పోలీసులు అరెస్టుచేయడం సబబుకాదని మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం నారాయణఖేడ్ మండలం జూకల్ శివారులోని బీసీ గురుకుల పాఠశాలను సందర్శించడానికి వెళితే పోలీసులు అడ్డుకోవడం ఎంతవరకు సరైందని ఆయన మండిపడ్డారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 1000 గురుకుల పాఠశాలను ప్రారంభించారని విద్యార్థులకు పది సంవత్సరాలకాలంలో నాణ్యమైన విద్య, భోజనం అందించడమే కాకుండా ఎలాంటి ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నూతనంగా గురుకులాలను నిర్మించకపోగా గురుకుల వ్యవస్థను భ్రష్టు పట్టించిందని విమర్శించారు. పాఠశాలను సందర్శించేందుకు వెళ్లగా మమ్మల్ని అక్రమంగా అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌ను తరలించడం తగదన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ లక్ష్మిబాయి రవీందర్ నాయక్, పార్టీ మండల అధ్యక్షుడు పరమేష్, విఠల్ రావు, మున్సిపల్ మాజీ సర్పంచ్ నజీబ్, మాజీ వైస్‌చైర్మన్ పరశురాం, కౌన్సిలర్లు అభిషేక్ శెట్కార్, విఠల్, పార్టీ మండల ఉపాధ్యాక్షుడు నర్సింలు, పట్టణ అధ్యక్షుడు నగేష్, అంజాగౌడ్, మాజీ ఎంపీటీసీ ముజమ్మిల్, మాజీ సర్పంచ్ సంగప్ప, నాయకులు మల్‌గొండ, సిద్దు, అశోక్, కిరణ్‌రావు, ప్రశాంత్ సాగర్, మహేందర్‌గౌడ్, సంతోష్ కురుమ, ఉన్నారు.



మాట్లాడుతున్న మాల మహానాడు నాయకులు

### ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ చైర్మన్‌ను సిద్దిపేటకు పంపించాలి : మాల మహానాడు నాయకులు

**కొండపాక, డిసెంబరు 2, ప్రభాతవార్త :** ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ చైర్మన్ శమీమ్ అక్తార్‌ను సిద్దిపేటకు వచ్చేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కోదాది శ్రీనివాస్, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ జిల్లా కన్వీనర్ గుడిమల్ల సత్తయ్య, కన్వీనర్ అల్లిబిల్లి నర్సింగరావు తదితరులు డిమాండ్ చేశారు. సోమవారం సిద్దిపేటలో వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ విషయంలో విచారణ కోసం వచ్చే కమిటీ చైర్మన్‌కు వినతిపత్రాలు ఇవ్వడానికి ఉమ్మడిజిల్లా మాలలు, మాదిగలు, ఉపకులాలు సంగారెడ్డికి రావాలని ప్రభుత్వం ప్రకటించడం సరికాదన్నారు. సిద్దిపేట పట్టణానికి 140 కిలోమీటర్ల దూరంలో ఉన్న సంగారెడ్డి మాల, మాదిగ కులం, వారి ఉప కులాలు అంత దూరం రావాలని చెప్పడం హస్యాస్పదంగా ఉందన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంగా ఏర్పడి 6 సంవత్సరాలు గడిచిపోతుందన్నారు. జిల్లా కేంద్రంగానే ఎస్సీ వర్గీకరణ కమిషన్ చైర్మన్ సిద్దిపేటకు వచ్చి విచారించడం, వినతిపత్రాలు తీసుకోవడం జరగాలని కోరారు. నిరుపేదలైన దళితులు 140 కిలో మీటర్ల దూరం ప్రయాణించడానికి ఎంతో ఖర్చు అవుతుందని వారు అవేదన వ్యకం చేశారు. దళిత కులాలను ఇబ్బందులకు గురిచేయకుండా ప్రభుత్వం చర్యలు తీసుకొని కమిషన్ చైర్మన్‌ను సిద్దిపేటకు వచ్చేలా చూడాలని కోరారు.

### కాద్లూర్‌లో 11 నుంచి శ్రీమల్లికార్జున స్వామి జాతర

**టేక్మాల్, డిసెంబరు 2 ప్రభాతవార్త :** మండలపరిధిలోని కాద్లూర్ గ్రామంలో డిసెంబర్ 11 నుంచి శ్రీమల్లికార్జునస్వామి జాతర మహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 11వ తేదీన బోనాలు, 12న బండ్లు, 13న కుస్తీ పోటీలు, 14న రథోత్సవం, ఒగ్గు కథలు, 15 పాషి బండ్లు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని జాతరను విజయవంతం చేయాలని గ్రామ పెద్దలు కోరారు.

### గీతం స్కాలర్ మంగపతికి డాక్టరేట్

**పటాన్‌చెరు, డిసెంబరు 2,ప్రభాతవార్త:** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లోని గణిత శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి మంగపతి నేరుకొండ డాక్టరేట్‌కు అర్హత సాధించారు. వివిధ రకాల మెట్రిక్ స్పేస్‌లలో అప్లికేషన్‌తో స్థిర పాయింట్ సొల్యూషన్స్‌పై ఒక అధ్యయనం అనే అంశంపై సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లోని గణిత శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.రామకోటేశ్వరరావు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. మంగపతి పరిశోధన గణిత విశ్లేషణ, కంప్యూటర్ సైన్స్, అనువర్తిత గణితంలో గణనీయమైన ప్రాముఖ్యతను కలిగి ఉన్న స్థిరపాయింట్ సిద్ధాంతం కీలకమైన రంగాన్ని పరిశీలించిందని పేర్కొన్నారు. ఆయన విస్తృత శోధన స్థిరపాయింట్ పరిష్కాలను నిర్ణయించడానికి వినూత్న పద్ధతులను పరిచయం చేసిందని, విభిన్న మెట్రిక్ ప్రదేశాలలో వాటి వినియోగాన్ని అన్వేషించిందని తెలిపారు. ఈ సిద్ధాంత వ్యాసం, స్థిరపాయింట్ సొల్యూషన్స్‌పై అవగాహన పెంచడమే కాకుండా వాస్తవప్రపంచ సమస్యలకు వర్తించే ఆచరణాత్మక అంతర్దృష్టులను కూడా అందిస్తుందోన్నారు. ఇది సమగ్ర సమీకరణాలు, హోమోటోపీ సమస్యలతో సహా స్థిరపాయింట్ సిద్ధాంతం యొక్క అనువర్తనాలను పరిష్కరించడానికి ఒక నూతన విధానాన్ని అందిస్తుందని తెలిపారు. సవివరణాత్మక ఉదాహరణ ద్వారా మంగపతి తన కొత్త పద్ధతుల యొక్క ప్రామాణికత, ఉపయోగాన్ని చూపడంతోపాటు స్థిరపాయింట్ పరిష్కారాల సంక్లిష్టత, వినియోగానికి గణనీయంగా తోడ్పడినట్లు వివరించారు.మంగపతి సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్‌డీ పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డి.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ఇన్ ఛార్జి ప్రిన్సిపాల్, గణిత శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ మోతహర్ రెజా, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పలువురు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ప్రజాపాలనపై ప్రజలకు అవగాహన



ప్రజాపాలనపై ఆటపాటలతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాకారులు

**కొల్చారం, డిసెంబరు 2, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కొల్చారం గ్రామంతో పాటు మండల పరిధిలోని రంగంపేట, అప్పాజీపల్లి గ్రామాల్లో గ్రామ పంచాయతీల వద్ద మెదక్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పౌర సంబంధాలశాఖ ఆధ్వర్యంలో సాంస్కృతిక కళాబృందం ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందాలని పాటలరూపంలో ప్రభుత్వ పథకాలను ఆయా గ్రామాలలోని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీమ్ లీడర్ యెల్ల సిద్ధులు, కారంగుల మాధవి, సువోల్ల కృష్ణ, సందుర్ల శేఖర్, కమ్మరి నర్సయ్య, టేక్మాల్ విజయలక్ష్మీ, తువస రామారావు, కళాకారులు బండారు నరసయ్య, బిట్ల ఎల్లయ్య, జింక దేవదాస్, పంచాయతీ కార్యదర్శి ప్రియాంక, కాంగ్రెస్ పార్టీ నాయకులు గోండ కృష్ణ, ప్రభాకర్, రమేష్, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## ఆపన్నహస్త మిత్రబృందం ఆర్థిక సహాయం

**గజ్వేల్ టౌన్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** గజ్వేల్ పట్టణానికి చెందిన ఆపన్నహస్త మిత్రబృందం సోమవారం 99వ ఆర్థిక సహాయ కార్యక్రమాన్ని నిర్వహించింది. గజ్వేల్ పట్టణానికి చెందిన ఇద్దరు మహిళలు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇందులో ఒకరు ఆపన్నహస్త మిత్ర బృందం సభ్యుడు రవికుమార్ భార్య సంతోషి ఉండగా ఆమె కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. మరో మహిళ సూర్యకళ ప్రమాదంలో గాయపడి నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. సూర్యకళ గజ్వేల్‌లో బ్యూటీపార్లర్ నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తుండగా ఆమె కుటుంబ పరిస్థితిని రవికుమార్, స్వామిల ద్వారా తెలుసుకున్న ఆపన్నహస్త మిత్రబృందం సభ్యులు ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం రూ.20వేల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు పాశికంటి బాలచంద్రం, ప్రధాన కార్యదర్శి కటుకం శ్రీనివాస్, సభ్యులు కొలిచెలిమె స్వామి, మంగళ సాయి, జనార్దన్, శ్రీకాంత్, కిష్టయ్య, దశరథ, సత్యనారాయణ, యాదగిరి, రాజు, వెంకటేష్, స్వామి పాల్గొన్నారు.

## చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి మృతి

**శివ్వంపేట, డిసెంబరు 2, ప్రభాతవార్త:** చెట్టుకు ఉరివేసుకుని వ్యక్తి మృతి చెందిన ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం పోతులబొగుడ గ్రామానికి చెందిన మంద నాగులు ( 32 ) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత సంవత్సరం కొత్త ఇల్లు కట్టుకున్నాడు. ఇంటికి తెచ్చిన అప్పులు తీర్చలేక జీవితంపై విరక్తి చెంది ఈనెల 01న మధ్యాహ్నం 12 గంటలకు ఇంటి నుండి వెళ్లిపోయి పొలం పక్కనే ఉన్న ఫారెస్ట్ లో చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. మృతుడి భార్య మంద పుష్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ఏఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

### సవరణ

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ... అనే వార్తలో బిజెపి నేత ప్రశ్నకు బదులుగా మెదక్ ఎమ్మెల్యే ప్రశ్న అని పొరబాటున ప్రచురితమైనందుకు చింతిస్తున్నాం.

## సిఎం రేవంత్‌రెడ్డికి సత్కారం



సిఎం రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు అత్తు

**సిద్ధిపేట రూరల్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** జిల్లాలోని ములుగు మండలం బండతిమ్మాపూర్‌లో కోకో-కోలా కంపెనీ ప్రారంభోత్సవానికి సోమవారం విచ్చేసిన సిఎం ఎనుముల రేవంత్‌రెడ్డికి హెలిప్యాడ్ వద్ద సిద్ధిపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండి.ఇమామ్(అత్తు) ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కారించారు. ప్రభుత్వం పేదల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సిఎం రేవంత్‌రెడ్డి సూచించినట్లు అత్తు తెలిపారు.

## స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు



గోపూజ చేస్తున్న దృశ్యం

**కొమురవెల్లి, డిసెంబరు 2, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి యేడాది కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజాపాలనా.. ప్రజా విజయోత్సవాలలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని శ్రీ కొమురవెల్లి మల్లన్న సన్నిధిలో పలు పూజా కార్య క్రమాలు నిర్వహించారు. గోపూజ, మహాగణపతి పూజ వేద పారాయణం స్వామివారికి రుద్రాభిషేకం తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు, వేద పండితులు, ఆలయ ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, ఆలయ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## మానవహక్కుల వేదిక సహాయ కార్యదర్శి నియామకం

**అక్కన్నపేట, డిసెంబరు 2, ప్రభాతవార్త:** మానవహక్కుల వేదిక ఉమ్మడి కరీంనగర్ జిల్లా సహాయ కార్యదర్శిగా అక్కన్నపేట మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన కవి, రచయిత ముక్కెర సంపత్‌ను నియమిస్తూ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శనిగరం తిరుపతయ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో కరీంనగర్‌లో జరిగిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో సంపత్‌కు నియామకపత్రాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో తనకు ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని హామీ ఇచ్చారు. కాగా తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు రమేష్, ప్రధాన కార్యదర్శి మధు, ప్రస్తుత అధ్యక్షులు సుధాకర్‌రెడ్డిలకు వారు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## మండల ఎంపిడిఓగా శ్రీనివాస్‌వర్మ



ఎంపిడిఓగా బాధ్యతలు చేపడుతున్న దృశ్యం

**కొమురవెల్లి, డిసెంబరు 2, ప్రభాతవార్త:** మండల ఎంపిడిఓగా సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో వి.శ్రీనివాస్‌వర్మ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు అందేలా చూస్తానని తెలిపారు. మండలాభివృద్ధికి ప్రతి ఒక్కరూ పార్టీలకు అతీతంగా సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్, ఎఈవో, కార్యాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులు, ఈజిఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన బిఆర్‌ఎస్ నాయకులు



గిరికొండల్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరిన బిఆర్‌ఎస్ నాయకులు

**ధూళిమిట్ట, డిసెంబరు 2, ప్రభాతవార్త:** ధూళిమిట్ట మండలం జాలపల్లి గ్రామానికి చెందిన బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై పార్టీలో చేరారు. సోమవారం జనగామ డిసిసి అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి నాయకత్వంలో మాజీ జెడ్పిటిసి గిరికొండల్‌రెడ్డి ఆధ్వర్యంలో పోతిరెడ్డి ఇస్తారి, పోతిరెడ్డి విజయ్, రాజేందర్, కనకుంట్ల వెంకటేశ్, కణకుంట్ల అభిషేక్‌లు చేరారు. కార్యక్రమంలో జనగామ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కమలాకర్ యాదవ్, బండారం సాగర్, వెంకటేష్, లింగాల లత సాగర్, యాదగిరి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన విజయోత్సవాలలో శ్రమదానం



రోడ్లను శుభ్రం చేస్తున్న దృశ్యం

**చేర్యాల, డిసెంబరు 2, ప్రభాతవార్త:** ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా సోమవారం మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు సిబ్బందితో కలిసి మున్సిపల్ పరిధిలోని వీధుల్లో, రోడ్లపై శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి, కమిషనర్ ఎస్ నాగేందర్, వైస్ చైర్మన్ నిమ్మరాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్లు ఆడెపు నరేందర్, పచ్చిమడ్ల సతీష్ మున్సిపల్ మేనేజర్ ప్రభాకర్, సీనియర్ అసిస్టెంట్ కృష్ణ, వార్డు ఆఫీసర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మోసం చేయడంలో బిఆర్‌ఎస్, కాంగ్రెస్ రెండూ ఒకటే

### బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి మోహన్‌రెడ్డి

**సిద్ధిపేట అర్బన్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** ప్రజలను మోసం చేయడంలో బిఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఒకటేనని బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి మోహన్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డితో కలిసి మోహన్‌రెడ్డి మాట్లాడుతూ మిగులు బడ్జెతో ఉన్న రాష్ట్రాన్ని కెసిఆర్ అప్పుల పాలు చేస్తే రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చి రెట్టింపు చేస్తున్నాడని ఆరోపించారు. రాష్ట్రంలో పాలకులు మారారు కానీ పాలన మాత్రం మారలేదని, సంక్షేమ హాస్టళ్లలో కల్తీ ఆహారంతో ఇప్పటికి 40 మందికి పైగా విద్యార్థులు మరణించారన్నారు. కనీసం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించలేని స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. గడిచిన ఏడాది కాంగ్రెస్ పాలనపై వారం రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. వచ్చే ఎన్నికల్లో బిజెపి అధికారంలోకి



సమావేశంలో పాల్గొన్న బిజెపి నాయకులు

రావడం ఖాయమన్న అశాభావం వ్యక్తంచేశారు. సమావేశంలో నాయకులు విద్యా సాగర్, విభీషణ్ రెడ్డి, రామచంద్రం, ఉమారాణి, నరేష్, పద్మా గౌడ్, వెంకటేశం, మార్కండేయులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డికి ఘనస్వాగతం



సిఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న కలెక్టర్, సిపి

**సిద్ధిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** సిఎం హోదాలో జిల్లాలోని ములుగు మండలం బండ తిమ్మాపూర్‌లో హిందూస్థాన్ కోకాకోలా బెవరేజెస్ (హెచ్‌సిసిబి) అత్యాధునిక గ్రీన్‌ఫీల్డ్ ఫ్యాక్టరీని ప్రారంభించడానికి మొదటిసారి విచ్చేసిన సిఎం ఎనుముల రేవంత్‌రెడ్డికి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి, సిపి డాక్టర్ అనురాధలు పుష్పగుచ్చాలు అందజేసి హెలిప్యాడ్ వద్ద ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌గౌడ్, ప్రభుత్వ అధికారులు తదితరులు ఉన్నారు.

## సిద్ధిపేట అభివృద్ధికి నిధులు కేటాయించాలి



సిఎంను శాలువాతో సత్కారిస్తున్న నియోజకవర్గ పార్టీ ఇంచార్జి హరికృష్ణ

**సిద్ధిపేట రూరల్, డిసెంబరు 1, ప్రభాతవార్త:** సిద్ధిపేట నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని సిఎం రేవంత్‌రెడ్డిని నియోజకవర్గ పార్టీ ఇంచార్జి పూజల హరికృష్ణ కోరారు. జిల్లాలోని ములుగు మండలం బండ తిమ్మాపూర్‌లో కోకాకోలా కంపెనీ ప్రారంభోత్సవానికి జిల్లాకు సిఎం హోదాలో మొదటి సారి విచ్చేసిన సిఎం రేవంత్‌రెడ్డికి ఆయన హెలిప్యాడ్ వద్ద ఘనస్వాగతం పలికి శాలువాతో సత్కారించారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో యేడాది పాలన విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా అభినందనలు తెలిపారు. సిద్ధిపేటకు నిధులు కేటాయించాలని సిఎంకు విన్నవించగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

## సిఎం కప్ క్రీడా పోటీలపై సమీక్ష

**మర్కుక్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ముఖ్యమంత్రి కప్ క్రీడా పోటీలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ అఫ్జలొద్దీన్, ఎంఈఓ వెంకటరాములు మాట్లాడుతూ సిఎం కప్ క్రీడా పోటీల్లో భాగంగా కబడ్డీ, వాలీబాల్, ఖోఖో క్రీడలు నిర్వహించడం జరుగుతుందని, 14 సంవత్సరాలలోపు, 18 సంవత్స రాలలోపు బాలబాలికలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 7,8 తేదీల్లో గ్రామపంచాయతీ స్థాయి, 10,11,12 తేదీల్లో మండల స్థాయిలో, 16,21 తేదీల్లో జిల్లా స్థాయిలో, 27వ తేదీ నుండి జనవరి 2వ తేదీ వరకు రాష్ట్ర స్థాయిలో క్రీడలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు పిఈటిలు రజిని పాములపర్తి 7093085273, కెజిబివి పిఈటి 8897891704, పిఈటి స్వామి 8179571312 నెంబర్లలో సంప్రతించాలని కోరారు. ఈ సమీక్షా సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, పిఈటిలు పాల్గొన్నారు.

## సంకల్పంతో ఎంత గొప్ప కార్యమైనా సాధించవచ్చు

**సిద్ధిపేట అర్బన్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** సంకల్పముంటే ఎంత గొప్ప కార్యమైనా సాధించవచ్చునని సిద్ధిపేట ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కలకుంట్ల రంగాచారి అన్నారు. సిద్ధిపేట నుంచి శబరిమల వరకు పాదయాత్ర ముగించుకొని సోమవారం సిద్ధిపేటకు వచ్చిన యాదవరెడ్డికి ఘనస్వాగతం పలికి ప్రెస్‌క్లబ్ పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అయప్ప స్వామి కృప అందరిపై ఉండాలన్నారు. అయప్పస్వామి యాదవరెడ్డి తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో జర్నలిస్టులు రాజిరెడ్డి, తోట అశోక్, బి.రాజు, ఆకుల పాండురంగం, తిప్పర్తి భాస్కరచారి, నాయిని సంజీవరెడ్డి, వెంకట్, నరేష్, శ్రీనివాస్, వెంకటరమణరెడ్డి, చందు,జనార్ధన్ పాల్గొన్నారు.

## ప్రతిభ ఉంటే అన్ని రంగాల్లో విజయం



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

**హుస్నాబాద్ రూరల్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** విద్యార్థులకు గణితంలో ప్రతిభ ఉంటే భవిష్యత్తులో అన్ని రంగాల్లో విజయం సాధించగలుగుతారని సిద్ధిపేట జిల్లా లైబ్రరీ చైర్మెన్ కేడం లింగమూర్తి అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయి గణిత టాలెంట్ టెస్ట్‌ను హుస్నాబాద్ గణిత ఫోరం సభ్యులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా లైబ్రరీ చైర్మెన్‌తో పాటు మండల విద్యాధికారి బండారి మనీల ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా వారు నిర్వహించిన పోటీ పరీక్షలో రెసిడెన్సి యల్ విభాగం నుండి 24 మంది, జిల్లా పరిషత్ పాఠశాలల నుండి 18, తెలుగు మీడియం నుండి 10 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారని వారి లో రెసిడెన్షియల్ విభాగం నుండి మోడల్ స్కూల్ విద్యార్థి సాత్వీక్‌రెడ్డి ప్రథమ స్థానంలో నిలవగా, ద్వితీయ స్థానంలో హర్షిని మోడల్ స్కూల్, మహాత్మ జ్యోతిబాపులే విద్యార్థిని మేఘన, జిల్లా విభాగంలో పోతారం విద్యార్థి పవన్, పొట్లపల్లి అక్షిత, బాలుర ఉన్నత పాఠశాల నుండి కూడా ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రధాన చేయడం జరిగిందన్నారు. ఈ కార్య క్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్, బాలుర పాఠశాల ప్రధానోపా ధ్యాయులు వాసుదేవరెడ్డి, బాలికల ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య, మహేందర్‌రెడ్డి, గణిత ఫోరం జిల్లా ఉపాధ్యక్షులు మల్కిరెడ్డి మోహన్‌రెడ్డి, వేణుకుమార్, మండల అధ్యక్షులు కొత్తపల్లి మహేందర్, గణిత ఉపాధ్యాయులు సుభాష్, రఫీ, రాజేందర్, శివ, సతీష్‌తో పాటు ఉన్నారు.

## మండల స్థాయి గణిత ప్రతిభ పరీక్ష



విజేతలకు ప్రశంసా పత్రం అందజేస్తున్న దృశ్యం

**కోహెడ, డిసెంబరు 2, ప్రభాతవార్త:** కోహెడ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో సోమవారం మండలంలోని అన్ని జిల్లా పరిషత్, కెజిబివి పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయి మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి రాళ్లబండి పద్మయ్య మాట్లాడుతూ గణిత ప్రతిభా పరీక్ష పోటీల ద్వారా విద్యార్థులలో పోటీ తత్వం, గణితం పట్ల ఆసక్తి పెరుగుతుందన్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను, ప్రతిభా పరీక్ష నిర్వాహకులను ఆయన అభినందించారు.

పరీక్షలలో శనిగరం పాఠశాల విద్యార్థి మనిస్రుజన్ ప్రథమ, టి.లతిక ద్వితీయ స్థానంలో నిలిచారు. అలాగే వింజపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థి జి.రక్షిత తృతీయ స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.డి.మహమూద్, గణిత ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వేణుగోపాల్, గణిత ఫోరం మండల అధ్యక్షులు బాలయ్య, ప్రధాన కార్యదర్శి రమాదేవి, ఆర్థిక కార్యదర్శి విజయలక్ష్మీ, సురేందర్‌రెడ్డి, రాజు, కరీమొద్దీన్, చంద్రశేఖర్, గీత, మౌనిక, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సిఎం కప్ క్రీడలకు ఆహ్వానం

### -సిఎం కప్ క్రీడా పోటీలపై సమీక్షా సమావేశం



సిఎం కప్ క్రీడల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ప్రత్యేకాధికారి వినయ్‌కుమార్

**జగదేవ్‌పూర్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** మండలకేంద్రమైన జగదేవ్‌పూర్‌లోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం సిఎం కప్-2024 క్రీడా పోటీల నిర్వహణపై మండల స్థాయి కమిటీ చైర్మన్ వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లోని బాలబాలికలకు, యువతీ యువకులకు క్రీడల్లో నైపుణ్యాలను పెంపొందించాలని, చెడు వ్యసనాలకు పాల్పడకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో సిఎం కప్ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రీడల్లో భాగంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను మండలంలోని ప్రతి గ్రామపంచాయతీలో అండర్-14, అండర్-18 విభాగాల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈనెల 7,8 తేదీల్లో గ్రామస్థాయిలో క్రీడలు నిర్వహించి మూడు విభాగాల్లో గెలుపొందిన విజేతల వివరాలను ఈనెల 10 లోపు మండల క్రీడా పోటీల నిర్వహణ అధికారి ఏలేశ్వర్‌రావుకు పంపాలని, ఏమైనా సందేహాలు ఉంటే 9989170936ను సంప్రతించాలన్నారు. గ్రామాల్లో విజేతలుగా నిలిచిన వారికి మండలస్థాయిలో 11,12 తేదీల్లో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్రీడా పోటీలు ఉంటాయని, మండలస్థాయిలో గెలుపొందిన విజేతలను జిల్లాస్థాయికి ఎంపిక చేస్తామని అన్నారు. ఈ అవకాశాన్ని గ్రామాల్లోని బాలబాలికలు, యువతీ యువకులు సద్వినియోగం చేసుకొని క్రీడా పోటీలకు ముందుకు రావాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో వారి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి కన్వీనర్, ఎంపిడిఓ బి. యాదగిరి, సభ్యులు తహసీల్దార్ కృష్ణమోహన్‌రావు, మండల విద్యాధికారి మాధవరెడ్డి, ఎస్ఐ చంద్రమోహన్, మండల పంచాయతీ అధికారి ఖాజా మొయినొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న డిఎం

**హుస్నాబాద్ రూరల్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** విధి నిర్వహణలో హుస్నాబాద్ డిపో మేనేజరు నిర్లక్ష్యం వహిస్తున్నారని బిజెపి ఎస్టి మోర్చా జిల్లా నాయకులు నునావత్ మోహన్‌నాయక్ అన్నారు. సోమవారం ఒక తండాకు బస్సు సౌకర్యం కల్పించాలని వినతిపత్రం ఇచ్చేందుకు డిపోకు వెళ్లిన గిరిజన నాయకుల వినతిపత్రాన్ని తీసుకోకుండా చులకనగా మాట్లాడారని మండిపడ్డారు. డిపో మేనేజర్ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని ఇలాగే వ్యవహరిస్తే బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు రైనా, బిక్షపతిలు ఉన్నారు.

**అనవసరపు ఆరోపణలు చేయవద్దు...**

తనపై వచ్చిన ఆరోపనలపై ప్రభాతవార్త డిఎం వెంకటేశ్వర్లు వివరణ కోరగా తన విధుల పట్ల తాను ఏనాడు నిర్లక్ష్యం వహించలేదని, తండాకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ వారు డిపో కార్యాలయంలోకి వచ్చిన విషయం వాస్తవమేనని.. కానీ ఆ సమయంలో తాను వేరే పనిపై బిజీగా ఉండడంతో వారికి సంబంధించిన వినతి పత్రాన్ని ఇన్‌వార్డులో ఇవ్వాలని చెప్పానని వివరించారు. గిరిజన నాయకులు తనపై తప్పుడు ఆరోపణలు మానుకోవాలని సూచించారు. వినతిపత్రం అందిస్తే బస్సుల సౌకర్యాన్ని బట్టి ఎలా పంపించాలో ఆలోచన చేస్తామన్నారు.

## టాలెంట్ టెస్టులో విజేతలు



విద్యార్థులకు ప్రశాంస పత్రాలను అందిస్తున్న ఉపాధ్యాయులు

**సిద్ధిపేట అర్బన్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** మండలస్థాయి గణిత ఫోరం ఆధ్వర్యంలో సోమవారం జెడ్పిహెచ్‌ఎస్ చింతమడకలో నిర్వహించిన గణిత టాలెంట్ టెస్టులలో ఇంగ్లీష్ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవసం చేసుకోగా, తెలుగు మీడియం విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను గెలుచుకుని జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కావేరి, సిహెచ్ రుక్షిత ఇంగ్లీష్ మీడియం, తెలుగు మీడియం విభాగం నుండి అభిలాష్, జె.సంజన. వెంకటేష్ విజేతలు కాగా గణిత ఉపాధ్యాయులు డి.రాజు, ఎస్ రామ్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు కొత్త రాజిరెడ్డి, ఉపాధ్యాయులు జి.బాలరాజ్, ఎండి. అజిత్, రాందాస్, సత్తయ్య, శ్రీహరి, శ్రీశైలం, శ్రీనివాస్‌రెడ్డి, ఎం.రాజు, మనిషా, వెంకటస్వామి, కృష్ణ, మనిలను అభినందించి ప్రశాంస పత్రాలను అందించారు.

## పంచాయతీ పరిధిలో వేలం పాటలు

**కొమురవెల్లి, డిసెంబరు 2, ప్రభాతవార్త:** రేపు (4వతేదీన) కొమురవెల్లి గ్రామ పంచాయతీలో వివిధ అంశాలకు సంబంధించిన బహిరంగ వేలం పాటలు నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి హరిప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో నిర్వహించబోయే ఈ వేలం పాటలు 4వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమౌతాయని, ఈ వేలంలో వాహనాల పార్కింగ్, అంగడి మధ్య బజార్, సులబ్ కాంప్లెక్స్ నిర్వహణలకు సంబంధించి వేలం పాటలు జరుగనున్నాయన్నారు. ఈ వేలం పాటల్లో పాల్గొనాలనుకునే వారు ముందుగా పార్కింగ్ కోసం 50వేలు,అంగడి కోసం 30వేలు, సులభ్ కాంప్లెక్స్ కోసం 30వేలు గ్రామ పంచాయతీకి డిపాజిట్ చేయాలన్నారు. వేలం దక్కించుకున్నవారు 50 శాతం అమౌంట్ 3 రోజులలో చెల్లించేందుకు అవకాశం ఉంటుందన్నారు. గ్రామానికి చెందిన ఆసక్తి గల వారు గ్రామ పంచాయతీ నుండి సాల్వేన్సీ సర్టిఫికేట్ తీసుకువచ్చి వేలంలో పాల్గొవాలని సూచించారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

**గజ్వేల్ టౌన్, డిసెంబరు 2 (ప్రభాతవార్త):** రాయపోల్ మండలం టెంకంపేట గ్రామానికి చెందిన రమేష్‌కు రూ.19,500, ములుగు మండలం సింగన్నగూడ గ్రామానికి చెందిన రాములుకు రూ.33వేల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు మంజూరు కాగా, అట్టి చెక్కులను ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి సోమవారం లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టెంకంపేట మాజీ సర్పంచ్ తిరుపతి, నర్సింలు, బిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

## పాముకాటుతో పాడి ఆవు మృతి



పాముకాటుతో మృతి చెందిన ఆవు

**కోహెడ, డిసెంబరు 2, ప్రభాతవార్త:** పాము కాటుతో పాడి ఆవు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కాచపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. అదే గ్రామానికి చెందిన రైతు రాచకొండ లక్ష్మీకాంతారావు ఎప్పటిలాగానే సోమవారం పొలం వద్ద ఆవును కట్టేశాడు. మధ్యాహ్నం వెళ్లి చూడగా ఆవు మృతి చెంది ఉంది. పాము కాటుతోనే ఆవు మృతి చెందినట్లు రైతు గుర్తించారు. ఆవు మృతితో సుమారు రూ.80 వేల ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు. బాధితుడిని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## కానిస్టేబుల్ లింగంకు సన్మానం



కానిస్టేబుల్ లింగంను సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

**జగదేవ్‌పూర్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** జగదేవ్‌పూర్ మండల కేంద్రానికి చెందిన సందీప్‌కుమార్ రెడ్డి అనే యువకుడు గత కొద్ది రోజుల క్రితం ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నంకు పాల్పడగా అపస్మారక స్థితిలో ఉన్న అతన్ని జగదేవ్‌పూర్ కానిస్టేబుల్ లింగం సిపిఆర్ చేసి ప్రాణాలు రక్షించినందుకు సోమవారం జగదేవ్‌పూర్ మండల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో కానిస్టేబుల్ లింగంను శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు రాగుల రాజు, సంఘం నాయకులు బాలకిషన్, చెక్కల నరేష్, బలరాం, కిషన్, ఎల్లేష్, నర్సింలు, మహిళా అధ్యక్షురాలు కొన్నె జయమ్మ, రామచంద్రం, అనిల్ తదితరులు పాల్గొన్నారు.